



మైదానం చుట్టుపక్కల మూడుచోట్ల ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఆర్చిలు

హ్యాండిచ్చారు...

- సిట్టింగ్‌లకు మొండిచేయి
- రాజంపేటకు ఆకేపాటి
- మదనపల్లెకు కొత్త ముఖం నిస్సార్ అహ్మద్



ఆకేపాటి అమర్‌నాథరెడ్డి




నిస్సార్ అహ్మద్

రాయచోటి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలో సిట్టింగ్‌లకు సీఎం జగన్ హ్యాండిచ్చారు. రాజంపేట అసెంబ్లీ స్థానానికి ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. మదనపల్లెకు మాత్రం నిస్సార్ అహ్మద్ అనే కొత్త ముఖాన్ని తెరపైకి తెచ్చి ఇన్‌చార్జ్‌గా నియమించారు. రాజంపేట వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి టికెట్ నిరాకరించారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన మేడా మలికార్జునరెడ్డి 2019 ఎన్నికల్లో వైసీపీ గూటికి చేరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈసారి కూడా మేడా మల్లికార్జునరెడ్డికే టికెట్ వస్తుందని ఆయన అనుచరులు భావించారు. దీనిని బలపరుస్తూ గత వారంలో మేడా మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరుడు రఘునాథరెడ్డిలను తాడేపల్లి ప్యాలస్‌కు పిలిపించి మల్లికార్జునరెడ్డికి టిక్కెట్‌ను ఖరారు చేశారు. అయితే తర్వాతం కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే మల్లికార్జునరెడ్డి స్థానంలో కడప జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేరు తెర మీదకు వచ్చింది. గురువారం రాత్రి ప్రకటించిన మూడవ జాబితాలో అమర్‌నాథరెడ్డి పేరు ఖరారు చేశారు. పార్టీ అధికారంలోకి వస్తే మేడా కుటుంబానికి రాజ్యసభ సభ్యత్వం ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిసింది. మేడాకు టికెట్ నిరాకరించినా ఆయన అనుచరుల నుంచి బహిరంగంగా ఎటువంటి నిరసనలు, అసంతృప్తి బయటపడలేదు. అయితే లోలోపల ఆయన వర్గీయులు రగిలిపోతున్నట్లు సమాచారం. తొలుత టికెట్ నీకే అని చెప్పి ఐదు రోజుల వ్యవధిలో మొండిచెయ్యి చూపడాన్ని ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి టికెట్ రావడం వెనుక రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

మదనపల్లె సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్‌బాషాను రెండు వారాల కిందట ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లెకు పిలిపించి ఈసారి నీకు టికెట్ ఇవ్వడం లేదని చెప్పేశారు. దీంతో కొన్ని రోజుల పాటు ఎమ్మెల్యే అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఇప్పుడిప్పుడే మళ్లీ తిరుగుతున్నారు. టికెట్ నాకే వస్తుందనే ఆశతో నవాజ్‌బాషా ఉన్నట్లు పలువురు పేర్కొంటున్నారు. అయితే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల ఆశీస్సులతో రిటైర్డ్ ఉద్యోగి నిస్సార్ అహ్మద్‌ను మదనపల్లె ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ పరిణామంతో ఎమ్మెల్యే అనుచరులు తీవ్ర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. అభ్యర్థుల ప్రకటన తర్వాత రాజంపేటలో ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అనుచరులు, మదనపల్లెలో నిస్సార్ అహ్మద్ అనుచరులు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కాగా సిట్టింగ్‌లకు ఇన్‌చార్జ్‌లుగా నియమించడానికి తెరవెనుక ఎంపీ మిథున్‌రెడ్డి జరిపిన మంత్రాంగమే కారణమని పలువురు వైసీపీ నాయకులు పేర్కొంటున్నారు.

ఎలా ఆడించాలి జగనన్నా..!

- ఇచ్చింది గోరంత.. ఖర్చేమో కొండంత...
- 'ఆడుదాం ఆంధ్ర'తో చేతి చమురు వదిలించుకుంటున్న సెక్రటరీలు
- ఎంపీడీవోలకు తలభారం
- అరకొర నిధులతో ఆర్భాటంగా నిర్వహించాలంట..
- అందరికీ ఒకే సైజు టీషర్టుల పంపిణీ





ఆడుదాం ఆంధ్ర పేరుతో ముద్రించిన బ్యానర్లు

మదనపల్లె టౌన్, జనవరి 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం పంచాయతీ క్యాదర్శులు, ఎంపీడీవోలకు తలభారం తోకకు వచ్చినట్లు అవుతోంది. అంతంత మాత్రం నిధులు విడుదల చేసి ఆర్భాటంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు, మార్గదర్శకాలు ఇవ్వడంతో ఖర్చులు భరించలేక పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు కక్కలేక మింగలేక ఉండిపోతున్నారు. దాతలు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లను ప్రాథేయపడి భోజనం, ఇతర ఖర్చులు భరించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని డిసెంబరు 26వ తేదీ ప్రారంభించింది. దీని కోసం ప్రతి సచివాలయ పరిధిలో 18 ఏళ్లు నిండిన యువతతో క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలు నిర్వహించాలి. జనవరి 9వ తేదీ వరకు 14 రోజుల పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఐదు క్రీడల్లో గెలుపొందిన జట్లను మండల స్థాయిలో జరిగే క్రీడల్లో ఆడించాల్సి ఉంది. తొలిరోజున సీఎం జగన్ ఫ్లెక్సీ బ్యానర్లు, స్వాగత ఆర్చిలు, కిట్టు (కృష్ణజింక) లోగో బ్యానర్లు, మైదానం చుట్టూ ఆడుదాం ఆంధ్ర బ్యానర్లతో పాటు రంగు రంగుల బ్యానర్లు ఏర్పాటు చేయాలని మార్గదర్శకాలు జారీ చేశారు. వీటితో పాటు ప్రతి సచివాలయానికి 114 ఆడుదాం ఆంధ్ర టీ-షర్టులు, టోపీలు సరఫరా చేశారు. కాగా ఈ టీ షర్టులు అన్నీ ఒకే సైజులో ఉండేవి పంపిణీ చేయడంతో లావుగా ఉన్న యువతకు ఈ టీ షర్టులు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. వివిధ సైజుల్లో టీషర్టులు పంపిణీ చేసి ఉంటే బాగుండేదని క్రీడాకారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

రూ.10వేలతో 14 రోజుల పాటు క్రీడల నిర్వహణ ఎలా..?

14 రోజుల పాటు గ్రామ సచివాలయ స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడలకు పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీవోలు చేతి చమురు విదిలించుకోవాల్సి వచ్చింది. జిల్లాలో 501 గ్రామ సచివాలయాలు ఉండగా ప్రతి సచివాలయానికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం క్రీడల నిర్వహణకు నిధులు విడుదల చేసింది. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం మార్గదర్శకాల ప్రకారం ఆయా పంచాయతీల పరిధిలో మైదానం రెడీ చేయాల్సి వచ్చింది. మైదానంలో ముళ్లకంపలు తొలగించడం, మట్టి తోలడం, చదును చేయడంతో ప్రారంభమైన పనులు మైదానం సుందరీకరణ చేయాల్సి వచ్చింది. మైదానం చుట్టుపక్కల నాలుగు చోట్ల ఆడుదాం ఆంధ్ర పేరు ముద్రించిన నాలుగు జెండాలు, వీటితో పాటు చుట్టూ 60 రంగుల జెండాలు ఏర్పాటు చేయాలి. మైదానం పక్కనే క్రీడాకారులు కూర్చునేందుకు షామియానా, కుర్చీలు ఏర్పాటు చేయాలి. అలాగే సీఎం జగన్ ఫొటో ముద్రించిన ఆడుదాం ఆంధ్ర బ్యానర్‌తో పాటు, మైక్‌సెట్ ఏర్పాటు చేసి అందులో కామెంట్రీ వినిపించాలి. ఇదిలా ఉంటే మైదానం ప్రవేశ ద్వారం వద్ద సీఎం జగన్, ఆడుదాం ఆంధ్ర లోగో (కిట్) చిత్రాలతో ముద్రించిన బ్యానర్ల ఆర్చిని ఏర్పాటు చేయాలి. దీంతో పాటు ఆడుదాం ఆంధ్ర బ్యానర్ ఎదుట నిల్చొని ప్రేక్షకులు సెల్ఫీ తీసుకునేలా ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమం ప్రారంభం, ముగింపు కార్యక్రమాలు ప్రజా ప్రతినిధులు, డివిజన్ అధికారులతో కలసి అట్టహాసంగా చేయాలి. ఈ మార్గదర్శకాలతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణకు కేవలం రూ.10 వేలు మాత్రమే నిధులు విడుదల చేసింది.

ఖర్చు చూస్తే బోలెడు.. నిధులు చూస్తే జానెడు

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహించే ఐదు క్రీడలకు ప్రభుత్వం రూ.10 వేలు చొప్పున నిధులు విడుదల చేసింది. కానీ 14 రోజుల పాటు గ్రామ సచివాలయాల కింద ఆడుదాం ఆంధ్ర ఖర్చు ఒక్కో పంచాయతీకి ఎంత లేదన్నా 76,500 వచ్చినట్లు సమాచారం. దీంతో చాలా మండలాల్లో సచివాలయాల పరిధిలో కాకుండా ఒక్కో మండలంలో మూడుచోట్ల మైదానాలు ఏర్పాటు చేసి ఈ క్రీడలు నిర్వహించి ఖర్చులు సరిచేసుకున్నారు. ఇదిలా ఉండగా ఈ కార్యక్రమానికి వచ్చిన క్రీడాకారులు, యువతకు భోజనాలు ఏర్పాటు చేసేందుకు నిధులు లేకపోవడంతో పలువురు దాతలు, గ్రామ సర్పంచ్‌లను పంచాయతీ కార్యదర్శులు ఆశ్రయించాల్సి వచ్చింది. ఎలాగోలా 14 రోజుల పాటు క్రీడాకారులకు భోజనాలు ఏర్పాటు చేసి హమ్మయ్య అనిపించుకున్నారు. ఇకపోతే ఈనెల 10వ తేదీ నుంచి మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో ఈనెల 23వ తేదీ వరకు ఈ క్రీడలు నిర్వహించాల్సి ఉంది. కాగా మండలాల్లో క్రీడల నిర్వహణకు ఇంత వరకు ఎలాంటి నిధులు విడుదలైనట్లు ఉత్తర్వులు రాలేదు. మండల పరిషత్‌లోని జనరల్ ఫండ్స్ వాడదామంటే సర్క్యులర్ లేకపోవడంతో ఆడిట్‌లో ప్రాబ్లమ్ వస్తుంది. దీంతో ఖర్చుల కోసం దాతల వైపు అధికారులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడలు నిర్వహించాలి. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడలు నిర్వహించాలి. మొత్తం మీద ఐదు క్రీడలకు గాను క్రీడా పరికరాలు, ఆట వస్తువులు, టీ-షర్టులు, టోపీలు పంపిణీ చేసి చేతులు దులుపుకున్న ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో క్రీడల నిర్వహణకు అయ్యే ఖర్చుకు సరిపడా నిధులు విడుదల చేయలేదని విమర్శలు వచ్చాయి. దీంతో అంతంత మాత్రంగానే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించి అధికారులు మమ అనిపించారు.

ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఖర్చులు చూస్తే ఇలా ఉన్నాయి.

మైదానం చుట్టూ 60 రంగుల జెండాలు	6,000
ఆడుదాం ఆంధ్ర 4 జెండాలు	1000
షామియానా బాడుగ 14 రోజులకు	28,000
మైక్ సెట్ బాడుగ 14 రోజులకు	14,000
స్వాగతం ఆర్చీలు 3	7,500
ఆడుదాం ఆంధ్ర బ్యానర్లు	1200
కుర్చీలు 14 రోజుల బాడుగ	7,000
కిట్ బ్యానర్లు 3	1,800
ప్రారంభోత్సవం, ముగింపు ఖర్చులు	10,000



మదనపల్లె జడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో మండల స్థాయి క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

జగనన్న తోడును సద్వినియోగం చేసుకోండి : జేసీ



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, జేసీ

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 11: జగనన్న తోడు చిరు వ్యాపారులకు వరం లాంటిదని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం జగనన్న తోడు 8వ విడతలో భాగంగా చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు పొంది సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ కొన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జేసీ, ఎమ్మెల్యే మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, లబ్ధిదారులు తదితరలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ జగనన్న తోడు పథకం 8వ విడతలో జిల్లాలో మొత్తం 13,269 మంది లబ్ధిదారులకు రూ.1404 లక్షలు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారన్నారు. జిల్లాలో జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 17,698 మందికి రూ.42.43 లక్షలు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద జమ చేస్తారన్నారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని వ్యాపారులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినట్లయితే మళ్లీ వడ్డీ లేని రుణాలు పొందవచ్చునన్నారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు.



సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- వివిధ నగరాలకు 80 ప్రత్యేక బస్సులు
- దూరప్రాంతాల ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు

మదనపల్లె అర్బన్, జనవరి 11: ప్రయాణికుల సౌకర్యార్థం ప్రజా రవాణా సంస్థ సంక్రాంతి పండుగకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లాలోని ఐదు డిపోల నుంచి దూర ప్రాంతాలైన బెంగళూరు, హైదరాబాదు, చెన్నై నగరాలకు గురువారం నుంచే 80 ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ప్రయాణికులకు అధిక భారం పడకుండా సాధారణ చార్జీలతోనే ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోందని అధికారులు తెలిపారు. జిల్లాలోని ఐదు డిపోల నుంచి ప్రతిరోజూ నడిచే బస్సులు 448 కాగా దీనికి తోడు సంక్రాంతి ప్రత్యేక సర్వీసులు 80 నడుపుతోంది. దూరప్రాంతాలు, నగరాల నుంచి సొంతూర్లకు వచ్చే ప్రయాణికుల సంఖ్య దాదాపుగా 25 వేల వరకు ఉండవచ్చు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లె 1, 2, పీలేరు, రాజంపేట డిపోల నుంచి ప్రత్యేక బస్సులు వివిధ నగరాలకు స్పెషల్ సర్వీసులు నడుపుతోంది. హైదరాబాదుకు 5, బెంగళూరుకు 38, చెన్నైకు 6, విజయవాడకు 6, తిరుపతికి 25 సర్వీసులు నడుపుతున్నారు. ఇవేకాకుండా అవసరాన్ని బట్టి మరికొన్ని సర్వీసులు అప్పటికప్పుడే పెంచుకోవడానికి రవాణా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తిరుపతిలో అధికంగా చదువుతున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ సర్వీసులు నడుపుతున్నారు. జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి ప్రాంతాల నుంచి వేలాదిమంది హైదరాబాదు, విజయవాడ, చెన్నై, విశాఖపట్టణం, తదితర నగరాల్లో విద్యతో పాటు ఉద్యోగ, వ్యాపార రీత్యా స్థిరపడ్డారు. సంక్రాంతి, కనుమ పండగల సందర్భంగా విద్యార్థులకు పదిరోజులు వరకు సెలవులు ఇవ్వడంతో సొంతూర్లకు రానున్నారు. ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవడానికి డిమాండ్ ఏర్పడింది. రైళ్లల్లో రెండు నెలలకు ముందుగానే రిజర్వేషన్ చేసుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో కూడా సొంత ఊర్లకు వచ్చేందుకు ప్రయాణికులు రిజర్వేషన్లు చేసుకోవడంతో డిమాండ్ ఏర్పడింది.

11 నుంచి ఆర్టీసీ బస్సులు..



సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా నుంచి వివిధ నగరాలకు రాకపోకలు సాగిస్తున్న సాధారణ బస్సులతో పాటు నడుపుతున్న ప్రత్యేక సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రయాణికుల అవసరాలు, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండగకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాం. ముఖ్య నగరాలకు 80 సర్వీసులు నడుపుతున్నాం. అవరాన్ని బట్టి ఇంకా బస్సులను అందుబాటులోకి తెస్తాం.

- పి.రాము జిల్లా ప్రజారవాణా అధికారి, అన్నమయ్య జిల్లా

సాధారణ ఛార్జీలతో స్పెషల్ బస్సులు..



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రయాణీకులకు సాధారణ చార్జీలతోనే స్పెషల్ సర్వీసులు నడుపుతున్నాం. మదనపల్లె-1 డిపో నుంచి బెంగళూరుకు పది బస్సులు, హైదరాబాదుకు మూడు ప్రత్యేక సర్వీసులు నడుపుతూ సాధారణ సర్వీసులు కూడా నడుపుతున్నాం. ప్రయాణికుల అవసరాన్ని, రద్దీని బట్టి ఇంకా బస్సులను అందుబాటులో ఉంచుతాం.

- మూరే వెంకటరమణారెడ్డి, వన్ డిపో మేనేజరు, మదనపల్లె



కల్యాణ వేదిక వద్ద పనులను పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, అధికారులు

బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పరిశీలించిన టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట, జనవరి 11: కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. గురువారం కోదండరామాలయం అభివృద్ధి పనుల్లో భాగంగా టీటీడీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా రామాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. రామాలయం వద్ద చేపట్టవలసిన అభివృద్ధి పనులు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్వేటి మండపానికి సిమెంటు రోడ్డు వేయాలని నిర్ణయించారు. వీటితో పాటు పురాతన మండపాలను అభివృద్ధి పరచాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రామాలయ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆర్డీవో మధుసూదన్‌కు తెలిపారు. అనంతరం కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న పనుల వివరాలను తెలుసుకున్నారు. బ్రహ్మోత్సవాల నాటికి కల్యాణ వేదిక వద్ద ఉన్న అన్ని రకాల అభివృద్ధి పనులను చేపట్టాలని అవసరమైన నిధులను విడుదల చేస్తామన్నారు. బ్రహ్మోత్సవాలు ఏప్రిల్‌లో నిర్వహిస్తామని, ఫిబ్రవరి చివరి నాటికి క్షేత్రస్థాయిలో సివిల్ పనులను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. కల్యాణ వేదిక వద్ద జాంబవంతుడి విగ్రహం, భక్తులకు అవసరమైన మరుగుదొడ్లు, తాగునీటి పైపులైన్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం కోదండరాముడిని టీటీడీ అధికారులతో కలిసి దర్శించుకున్నారు.

కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెడతాం

కోదండరాముని కల్యాణ వేదిక ప్రాంతంలో నిబంధనల మేరకు కొంతమంది కాంట్రాక్టర్లు సమయానికి అనుకూలంగా పనులు చేయడం లేదని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తక్కువగా ఉన్నాయని అలాంటి కాంట్రాక్టర్ల పేర్లను బ్లాక్‌లిస్టులో పెడతామని తెలిపారు. మళ్లీ వారు టెండర్లలో పాల్గొనేందుకు వీలు లేకుండా చేయాలని టీటీడీ సీఈ నాగేశ్వరరావును జేఈవో ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమీపిస్తున్నాయని భక్తులకు అవసరమైన అన్ని పనులు చేపట్టాలన్న ఉద్దేశ్యంతో టెండర్లను పిలిచామని, కొంతమంది అలసత్వం వహిస్తున్నారని వారిపై చర్యలు ఉంటాయని జేఈవో తెలిపారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో మధుసూదన్‌రావు, తహసీల్దార్ మాధవీలత, ఎంపీడీవో రెడ్డయ్య, సీఐ పురుషోత్తం రాజు, ఏఈ అమర్‌నాథ్‌రెడ్డి, డిప్యూటీ ఈవో నటేష్ బాబు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.



టయోటా కార్లలో నాజల్ పంప్స్ చోరీ

- దొంగ అరెస్టు
- రూ.20 లక్షలకుపైగా విలువైన నాజల్స్ పట్టివేత



నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె అర్బన్, జనవరి 11: టయోటా కార్లలో ఖరీదైన నాజల్ పంప్స్ దొంగిలించి కర్ణాటకలో అమ్ముతున్న దొంగను గురువారం ముదివేడు పోలీసులు అరెస్టు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ మీడియాకు వివరించారు. తంబళ్లపల్లె నియోజకవర్గం, పెద్దమండెం మండలం కలిచర్ల బండమీదవీధికి చెందిన చాంద్‌బాషా కుమారుడు ఎం.హర్షద్ (19) మదనపల్లెలో టయోటా కార్లలో గుట్టుచప్పుడు కాకుండా నాజల్ పంప్స్‌ను చోరీ చేసేవాడని చెప్పారు. ఇక్కడ నుంచి నాజల్ పంప్స్‌ను కారులో కర్ణాటకకు తరలించి బెంగళూరులో విక్రయించేవాడని చెప్పారు. ఈ నేపథ్యంలో నాజల్ పంప్స్‌ను తీసుకుని బెంగళూరుకు తరలిస్తుండగా నిందితుడిని మదనపల్లె సమీపంలో ముదివేడు పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.20 లక్షల విలువ చేసే నాజల్ పంప్స్, వాటిని తరలిస్తున్న కారును సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుడిని ముదివేడు పోలీస్‌స్టేషన్‌కు విచారణ కోసం తరలించామన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనపర్చిన సీఐ శివాంజనేయులు, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

స్కిల్ హబ్ సెంటర్‌లో దక్షిణ కొరియా బృందం

రాయచోటిటౌన్, జనవరి 11: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నడుస్తున్న స్కిల్ హబ్ సెంటర్‌ను గురువారం గుడ్ నైబర్స్ ఇంటర్నేషన్ ఆర్గనైజేషన్ సౌత్ కొరియా బృందం సభ్యులు పరిశీలించారు. అక్కడ శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడి వారికి ఎటువంటి శిక్షణ ఇస్తున్నారు, శిక్షణలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అలాగే నిరుద్యోగులకు శిక్షణ అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా వారికి ఏ విధమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ సౌత్ కొరియా బృందం సభ్యులు హన్, జమ్మిలియా, సందీప్‌గుప్తకు అన్ని విషయాలపై వివరించారు. అనంతరం సౌత్ కొరియా టీమ్ మెంబర్స్ ఇక్కడ శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులతో మాట్లాడిన అనంతరం రాబోయే రోజుల్లో వారికి గుడ్‌నైబర్స్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ తరపు నుంచి ఉపాధి అవకాశాల్లో తమ వంతు సాయం చేస్తామని తెలిపారు. వారిని సత్కరించారు. కార్యక్రమంలో గుడ్ నైబర్స్ ఆర్గనైజేషన్ సంస్థ మేనేజర్ నాగేశ్వరరావు, కొరియా టీం మెంబర్స్, శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ఆరా తీస్తున్న దక్షిణ కొరియా బృందం సభ్యులు

హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు





ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కడప (సెవెన్ రోడ్స్), జనవరి 11: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా సమితి పిలుపులో భాగంగా గురువారం కడప కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ 20 ఏళ్లగా ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజన్సీలను నడుపుతున్నారన్నారు. వీరికి ఇప్పటికీ సరైన గుర్తింపు లేదన్నారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు మద్దిలేటి, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడుతాం'

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరుద్యోగులకు ఏటా జనవరిలో జాబ్‌క్యాలెండరు, మెగా డీఎస్సీ విడుదల చేస్తామని నమ్మబలికి అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్ మోసగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం విడుదల చేయకుంటే రాబోయే ఎన్నికల్లో వైసీపీ చరమగీతం పాడుతామని విద్యార్థి, యువజన సంఘం నేతలు హెచ్చరించారు. గురువారం కడప నగరం ప్రగతి నర్సింగ్ హోం లో నిర్వహించిన సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, జిల్లా కార్యదర్శి గండి సునీల్‌కుమార్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కొమ్మలపాటి సుబ్బరాయుడు, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ల బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సగటున రోజుకు ఒక నిరుద్యోగి చొప్పున నాలుగేళ్లలో 1345మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకు న్నార న్నారు. బుధవారం బి.మఠం మండలంలో పాపిరెడ్డిపల్లె చెందిన శ్రీనాధ్ ఆత్మహత్య చేసుకున్న విషయం గుర్తు చేశారు. తక్షణం డీఎస్సీ విడుదల చేయాలని లేదంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ట్రాక్టర్ బోల్తా ఒకరు మృతి



వెంకటేష్ మృతదేహం

ఓబులవారిపల్లె, జనవరి 11: మండలంలోని వై.కోట గ్రామ పంచాయతీ వెంకటేశ్వరపురం ఎస్టీ కాలనీలో బుధవారం రాత్రి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో అదే కాలనీకి చెందిన గిలకాపటి వెంకటేష్ (22) మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల మేరకు... వై.కోట గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి వద్ద వినీత్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. వెంకటేష్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగేంచేవాడు. వీరిద్దరు బుధవారం సాయంత్రం ట్రాక్టర్‌తో ఎర్రమట్టి తలించేందుకు వెళ్లారు. పని ముగియగానే ట్రాక్టర్‌ను యజమాని ఇంటి వద్ద పెట్టేందుకు వెళుతుండగా ట్రాక్టర్ అదపు తప్పి బోల్తా పడటంతో టైర్ కింద పడ్డ వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ వినీత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు.

మృతుడు వెంకటేష్‌కు భార్య ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద వెంకటేష్ మృతితో నిరుపేద కుటుంబం దిక్కు లేనిది అయ్యిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పారదర్శక ఓటర్ల జాబితాకు కృషి చేయాలి

● జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 11: జిల్లాలో పారదర్శకంగా జాబితా రూపొందించడానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాల్లో లక్ష్యాలను సాధించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం విజయవాడ సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి సార్వత్రిక ఎన్నికలు, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ పథకం, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, మహిళా శిశు సంక్షేమం, అసైన్డ్ భూములు, హౌసింగ్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సమీక్షించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జేసీ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలో భాగంగా అభ్యంతరాలపై అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. బీఎల్ఈ,



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఈఆర్‌వో లాగిన్‌లో ఏడు రోజులు పైబడిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ క్యాంపులను పటిష్ఠంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. ఉపాధి హామీలో నేరుగా లక్ష్యాలను పూర్తి చేయాలని, మూడో దశ రీసర్వే పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్మికులపై ఎస్మా ఎత్తి వేయాలి

● ప్రజా సంఘాల డిమాండ్



అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

కడప (సెవెన్ రోడ్స్), జనవరి 11: అంగన్వాడీల వేతనాలు పెంచాలని, ఎస్మా చట్టాన్ని ఎత్తివేయాలని, జీఓ నెం.2 రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద ప్రజా సంఘాల నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజులుగా అంగన్వాడీలు ప్రజాస్వామ్య పద్ధతిలో వేతనాలు పెంచాలని, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం విధుల్లో చేరాలని బెదిరించడం దుర్మార్గమన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరడం తప్పా అన్నారు. అంగన్వాడీ, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నేత నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, అన్వేష్, టీడీపీ అధికార ప్రతినిధి బాలదాసు, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, సీపీఐ ఎంఎల్ జిల్లా నేత డబ్బురాము, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరిరెడ్డి, బీసీ సంఘం జిల్లా కన్వీనరు అవ్వారు మల్లికార్జున, హేతువాద సంఘం జిల్లా కన్వీనరు సీఆర్వీ ప్రసాద్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గురప్ప, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సునీల్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరసయ్య, లోక్‌సత్తా, ఆర్ఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్, మహానాడు, రైతు కూలి సంఘం నేతలు దేవరక్రిష్ణ, సుబ్బరాయుడు, జయవర్ధన్, రాజు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్

కడప(కలెక్టరేట్) జనవరి 11: జిల్లాలో అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి హౌసింగ్, రెవెన్యూ, పంచాయితీరాజ్ అన్ని రకాల సంక్షేమ పథకాల అమలు తీరుపై కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు నగర కమిషనరు ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తున్న గ్రామ సచివాలయాలు, రైతుభరోసా, అంగన్వాడీ, వైఎస్సార్ క్లినిక్‌లు తదితర ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలపై దృష్టి సారించి వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు సుధాకర్ రెడ్డి, వెంకట్రావు, శ్రీలక్ష్మి, కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సురభి నాటకాలను విజయవంతం చేయాలి

పులివెందుల, జనవరి 11: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని పులివెందులలో ఏర్పాటు చేసిన ప్రఖ్యాత సురభి నాటకోత్సవాలను విజయవంతం చేయాలని పాడా ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నగరవనం వద్ద సురభి నాటకోత్సవాల బ్రోచర్లను ఆర్డీఓ వెంకటేశులుతో కలిసి ఆవిష్కరించిన ఓఎస్డీ మాట్లాడుతూ 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే నాటకోత్సవాలను కుటుంబ సమేతంగా విచ్చేసి ఆనందించాలని కోరారు. నాటకం అంటే సురభి..సురభి అంటే నాటకం అనేలా ప్రఖ్యాతిగాంచిన నాటకోత్సవాలను వినాయక నాట్యమండలి ఆధ్వర్యంలో గరండాల రివర్ ఫ్రంట్‌లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్, డీఆర్‌డీఏ ఏసీ నీలకంఠారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ అధికారి జనార్దన్‌రెడ్డి, సీసీ టు ఆర్డీఓ కేశవ తదితరులు పాల్గొన్నారు.

పన్ను లేని ఐటీ పరిమితి పెంచాలి : ఏపీటీఎఫ్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: పెరిగిన ధరలకనుగుణంగా పన్ను చెల్లింపు లేని పరిమితి పెంచాలని ఏపీటీఎఫ్ అమ రావతి నేత సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి మార్పునకు నోచుకోని పన్ను లేని పరిమితిని రూ.7లక్షల వరకు పూర్తిగా అమలు పరచాలని డిమాండ్ చేశారు. పొదుపును ప్రోత్సహించే విధంగా సెక్షన్ 80సీ కింద కనీస పరిమితి రూ.2లక్షలకు పెంచాలని కోరారు. సీపీఎస్ చెల్లింపులు ప్రత్యేక సెక్షన్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో పలువురు మం డలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యవృత్తి విద్యాకోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజనల్ కోఆర్డినేటర్ ఎన్.సుబ్బరామిరెడ్డి తెలిపారు. సోలార్ టీవీ ఇన్‌స్టాలర్, సూర్యమిత్ర, సోషల్ మీడియా, ఎగ్జిక్యూటివ్, ఫ్రంట్ ఆఫీసు అసోసియేట్ అసిస్టెంటు బ్యూటీ థెరపి, ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ రిటైల్ సేల్స్ అసోసియేట్ జనరల్ డ్యూటీ అసిస్టెంటు, లైట్ మోటారు వెహికల్ డ్రైవరు కోర్సుల్లో శిక్షణ కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు జిల్లాలో కోర్టు ఎదురుగా, స్మిత్ రోడ్డులో ఉన్న తమ శిక్షణ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 90 రోజుల పాటు ఉచిత శిక్షణ, గుర్తింపబడిన సర్టిఫికెట్ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

● చమర్తి జగన్‌మోహన్‌రాజు



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు

సిద్దవటం, జనవరి 11: మండలంలోని మాచుపల్లె గ్రామంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా గురువారం సాయంత్రం క్రికెట్ టోర్నమెంటు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు హాజరై క్రికెట్ టోర్నమెంటు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉత్సాహంతో క్రికెట్ పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరచాలన్నారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి దశరథరామనాయుడు, లక్ష్మీనారాయణనాయుడు, రాజంపేట నియోజకవర్గ యువ నాయకుడు దారపునేని రాజేష్ నాయుడు, పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, స్థానిక నాయకులు పిచ్చిరెడ్డి, రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి నాగముని రెడ్డి, టీడీపీ మండల నాయకుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి : డ్వామా ఏపీడీ



ఉపాధి హామీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏపీడీ ప్రతాప్

పెనగలూరు, జనవరి 11: రాజంపేట డివిజన్‌లోని సన్న, చిన్నకారు రైతులు పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని డ్వామా ఏపీడీ ప్రతాప్ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గంలో 250 ఎకరాల్లో 18 రకాల పండ్లతోటల పెంపకానికి అనుమతులిచ్చిందన్నారు. గురువారం పెనగలూరు మండల ఉపాధి హామీ కార్యాలయంలో ఆయన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు ఎకరాలలోపు మెట్టభూమి కలిగిన సన్న, చిన్న కారు రైతులు అర్హులన్నారు. జాబ్‌కార్డు లేని రైతులకు ఉపాధి హామీ కార్యాలయంలో ఉచితంగా కార్డు అందజేస్తారని తెలిపారు. కాగా ఉపాధి హామీలో పనిచేసే కూలీలకు ప్రభుత్వం త్వరలోనే నిధులను విడుదల చేస్తుందని తెలిపారు. సమావేశంలో ఏపీవో మురళీ ఉన్నారు.

నేడు సత్యకుమార్ రాక



మీడియాతో మాట్లాడుతున్న సురేష్ తదితరులు

రైల్వేకోడూరు, జనవరి 11: మండలంలోని వైసూరివారి పల్లె పంచాయతీ పరిధిలో ప్రధాన దారికి పక్కన బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ రానున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్, రైల్వేకోడూరు అసెంబ్లీ కన్వీనర్ గడ్డం చంగల్‌రాజు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దాసరాజు జయప్రకాష్‌నారాయణవర్మలు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ బిట్రా శివన్నారాయణ, మాజీ మంత్రి, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, జిల్లా ఇన్‌చార్జ్ చంద్రమౌళి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, బీజేపీ నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ పోతుగుంట రమేశ్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు హాజరవుతున్నట్లు వివరించారు.

నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేయాలి

● సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సెక్రటరీ విశ్వనాథ్



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న యూనియన్ నాయకులు

నందలూరు, జనవరి11: కొత్త పింఛన్ల పద్ధతిని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండు చేస్తూ గురువారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్‌ఎంయూ) నాయకులు రైల్వేస్టేషన్ ఎదుట ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ విశ్వనాథ్ మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, లేనిపక్షంలో సమ్మె చేసేందుకు వెనుకాడబోమని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీలు బి.సిద్దయ్య, సి.వినోద్‌కుమార్, ఎస్.మహబూబ్‌బాషా, వైస్ చైర్మన్లు ఎస్.నరసింహులు, శివకుమార్‌రాజు కార్మికులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు రద్దు

రాజంపేట, జనవరి 11: సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 14వ తేదీన ఒంటిమిట్టలో తలపెట్టిన బండలాగుడు పోటీలను అనివార్య కారణాల ద్వారా రద్దు చేసినట్లు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రాయుడు ప్రకటనలో పేర్కొన్నారు. ఆ తేదీన జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా బండలాగుడు పోటీలు ఉన్నందున ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమాలు ఆగవు

ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమాలు ఆగవని అంగన్వాడీలు తెగేసి చెబుతున్నారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 31 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడినా తగ్గేది లేదు అంటున్నారు. ఈ సందర్భంగా రాయచోటి కలెక్టరేట్ ముందు నల్లబెలూన్లతో నిరసన తెలుపగా, లక్కిరెడ్డిపల్లెలో ఒంటికాళ్లపై నిరసన తెలిపారు. ఇక రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లోనూ నిరసన తెలిపారు.





రాయచోటి కలెక్టరేట్ ఎదుట నల్ల బెలూన్లతో మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు, కలెక్టరేట్ ముందు 31వ నెంబర్ వేసి నిరసన...

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 11: అంగన్వాడీలు చేస్తున్న సమ్మె గురువారం నాటికి 31వ రోజు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించినా, విధుల నుంచి తొలగిస్తామని షోకాజ్ నోటీసులు జారీ చేసినా తమ ఆందోళనను కొనసాగిస్తూనే ఉన్నారు. 31 రోజు గుర్తుగా కలెక్టర్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో 31వ నెంబర్ ఏర్పాటు చేసి మంటలు వేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, కోశాధికారి బంగారుపాప, నాయకురాళ్లు రమాదేవి, మధురవాణి, కుమారి, సుమలత, అరుణ, అంగన్వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

న్యాయంగా అడిగితే అక్రమ కేసులా ?

● బుక్కే విశ్వనాథ్‌నాయక్

న్యాయమైన డిమాండ్లు అడుగుతూ ప్రజా జీవనానికి ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీ వర్కర్లపై అక్రమ కేసులు బనాయించడం ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుక్కే విశ్వనాథ్‌నాయక్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్వాడీల సమ్మెలో భాగంగా 31వ రోజు గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి ఎదురుగా జాతీయ రహదారిపై అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, కోకన్వీనర్ సరోజమ్మల ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు నల్లబెలూన్లు చేతిలో పట్టుకొని నినాదాలు చేస్తూ మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ లీడర్లు సుజాత, అనురాధ, పద్మ, తులసి, శోభ, భారతి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటటౌన్: అంగన్‌వాడీల నిరసన గురువారంతో 31వ రోజుకు చేరింది. రాజంపేట అంగన్‌వాడీ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ నాయకురాలు ఈశ్వరమ్మ, శివరంజిని, మమత, విజయలక్ష్మీల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తుంటే ఎస్మా చట్టం ప్రయోగించడంతో పాటు నోటీసులను ఇవ్వడం దారుణమన్నారు. నెలరోజుల పైబడి ఆందోళనలు చేస్తుంటే ఏ మాత్రం ప్రభుత్వం చెలించకపోవడం అన్యాయమని వాపోయారు.

రైల్వేకోడూరు: ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమాలు ఆగవని రైల్వేకోడూరు అంగన్వాడీ సంఘం నాయకురాళ్లు పద్మ, లీలాలు తెలిపారు. గురువారం అంగన్వాడీలు, ఆయాలు నిరసనలు వ్యక్తం చేశారు. భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరిపినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉద్యమాలు తీవ్ర రూపం దాల్చాయన్నారు. ధర్నాలు, ర్యాలీలు, కలెక్టరేట్ ముట్టడి, గేదెకు వినతి పత్రం తదితర కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో నాయకురాళ్లు శిరీషా, రాధ, దుర్గా తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట అంగన్‌వాడీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

లక్కిరెడ్డిపల్లె: ఎన్ని జీఓలు ప్రవేశపెట్టినా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ధర్నాలు ఆగవని అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, ప్రధాన కార్యదర్శి ప్రభావతమ్మలు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె 31వ రోజు ఒంటికాలిపై మానవహారంతో నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామాపురం, లక్కిరెడ్డిపల్లెకు చెందిన అంగన్‌వాడీలు శారద, శ్రీవాణి, రుక్మిణి, శిరిష, లక్ష్మిదేవి, నాగవేణి, నాగమణి, ఐరగమ్మ, సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ న్యాయ మార్గంలో నడవాలి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, జేసీలు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 11: ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయమార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో సామాజిక సమతా సంకల్పంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఛాయా చిత్ర ప్రదర్శనను ఎమ్మెల్యే, జేసీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఈ నెల 19న విజయవాడలో దాదాపు రూ.400 కోట్లతో 20 ఎకరాల్లో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటుతో పాటు 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా ఘనంగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సామాజిక సమతా సంకల్పం (జన్ భాగాదరి) కార్యక్రమాన్ని, ఛాయా చిత్ర ప్రదర్శన కలెక్టరేట్‌లో నిర్వహించినట్లు తెలిపారు. అంబేడ్కర్ ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప దార్శనికుడని, సామాజిక న్యాయం సాధించడంలో ఆయన మార్గం అనుసరణీయమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, డీఆర్‌వో సత్యనారాయణ, ఆర్డీవోలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి, సమాచారశాఖ డీఐపీఆర్‌వో భరత్‌కుమార్‌రెడ్డి, డీపీఆర్‌వో పురుషోత్తం, కలెక్టరేట్ ఏవో బాలకృష్ణ, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి జాకీర్ హుస్సేన్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్.శివశంకర్, అంజనప్ప, కేవీ రమణ, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన సీఎం

● టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి

రైల్వేకోడూరు, జనవరి 11: సీఎం జగన్ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశాడని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. గురువారం రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలోని ఐదు కోట్ల ప్రజానీకానికి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, అక్రమాలు, భూ కబ్జాలు, దోపిడీలను ఎత్తిచూపేందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రా.. కదిలిరా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రులు ఎదుర్కొంటున్న సవాళ్లను సమస్యలను ఎత్తిచూపడం జరుగుతుందన్నారు. టీడీపీ కార్యక్రమాలకు వచ్చిన జనవాహినిని చూసి సీఎంకు వణుకు మొదలైందని, వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని ఇసుక, గ్రానైట్, మైనింగ్ పేరుతో రూ.లక్షల కోట్ల దోపిడీ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని నిలువునా సీఎం జగన్ ముంచేశారన్నారు. సీఎం చేసింది కూల్చివేతలు, రద్దులు, దాడులు, భూకబ్జాలు, కేసులే అని తెలిపారు. అభివృద్ధి మాత్రం శూన్యమైందన్నారు. యువతకు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం బాగుపడాలన్నా, అభివృద్ధి జరగాలన్నా, నిరుద్యోగం పోయి.. పిల్లల భవిష్యత్తు బాగుపడాలన్నా సీఎం జగన్‌ను గద్దె దింపాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోనాసి వెంకటసుబ్బయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు కొమ్మా శివ, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కమతం నాగరాజుయాదవ్, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పుల్లెల రమేష్, రాజంపేట పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తేనేపల్లి చిన్నా, గద్ద శ్రీరాములు, మిట్టవీధి మధు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల పరిశీలన



ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న ప్రసాద్‌రెడ్డి

రాజంపేట,జనవరి 11: రాజంపేట మండలం ఊటుకూరు గ్రామ పరిధిలోని ఉద్యానవన పంటలను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌బీకేల ద్వారా ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా ప్లాస్టిక్ మల్చింగ్ సబ్సిడీ పొందిన రైతులు పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి సభ్యుడు నాగేశ్వరరాజు, ఉద్యాన విస్తరణ అధికారి పూర్ణ చంద్ర, చెంగల్‌రాయుడు, చెంగల్‌రాజు, మురళి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: రైతులు ఉద్యాన, వాణిజ్య పంటలను పండించడం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని రాష్ట్ర ఉద్యాన సలహాదారుడు ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చెంచువారిపల్లె గ్రామంలో రైతులు పండించిన చామంతి, దోస పంటలను ఆయన పరిశీలించారు. రైతులకు ఎకరాకు ఎంత మేరకు పెట్టుబడి వస్తుంది, ఏ మేరకు లాభం వస్తుందనే దానిపై రైతులని అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సింధూరి, ఏవో కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది ప్రియదర్శిని, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రైతులు గురువయ్య, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేడు సంక్రాంతి సంబరాలు: జనసేన

నందలూరు, జనవరి 11: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా సమీపంలో రాజంపేట నియోజకవర్గ జనసేన నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు నేతృత్వంలో సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, జనసేన నాయకుడు ఆకుల చలపతి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే సంక్రాంతి పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలనే సదుద్దేశంతో ఈ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు.

విధుల్లో చేరిన మున్సిపల్ కార్మికులు



విధులకు హాజరైన మున్సిపల్ కార్మికులు

రాజంపేటటౌన్, జనవరి 11: రాజంపేట మున్సిపల్ కార్మికులు గురువారం విధుల్లో చేరారు. 16 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు ప్రభుత్వంతో చర్చలు జరిపిన తరువాత గురువారం విధుల్లో చేరారు. రాజంపేట మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి విధుల్లోకి తీసుకున్నారు. 16 రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తూ ఉండటంతో పట్టణంలో ఎక్కడిచెత్త అక్కడే పేరుకుపోయింది. వెనువెంటనే పట్టణంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి ఎక్కడా అపరిశుభ్రత లేకుండా చూడాలని మున్సిపల్ కార్మికులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఓబయ్య, లక్ష్మీదేవి, ప్రసాద్, రమణ, బాలాజీ పాల్గొన్నారు.

డీబీఎన్‌పల్లెలో 'బాబుష్యూరిటీ'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుబ్బనరసయ్యనాయుడు

రాజంపేట, జనవరి 11: రాజంపేట మండలం డీబీఎన్‌పల్లెలో టీడీపీ మండల అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బూత్ కన్వీనర్ వెంకటేశ్వర్లు, కేశవ తదితరుల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ నిరంకుశ విధానాలను తూర్పారబట్టారు. టీడీపీ అధికారంలోకి వస్తే జరిగే సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

సుగవాసి ప్రసాద్‌బాబును కలిసిన అమంచి



ప్రసాద్‌బాబు సన్మానిస్తున్న అమంచి స్వాములు

రాయచోటిటౌన్,జనవరి 11: రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబును గురువారం చీరాల జనసేన పార్టీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి అమంచి స్వాములు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ జనసేన నాయకులు రామశ్రీనివాస్, మదనపల్లె జనసేన నాయకులు రామాంజనేయులు, కాపు సంక్షేమ సేవ నాయకులు శరత్‌బాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

రామాపురం, జనవరి 11: మండలంలోని రాచపల్లె, హసనాపురం గ్రామాల్లో ఉద్యానశాఖ అధికారిణి నాగముని ఆధ్వర్యంలో సస్యరక్షణ చర్యలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తెగుళ్ల నివారణకు సరైన మందులు వాడితే ఫలితం ఉంటుందని, తదితర సూచనలు అందజేశారు. కార్యక్రమానికి ఆర్‌బీకే సహాయకులు అప్సర్‌అలీఖాన్,వెంకట్రమణ, రైతులు పాల్గొన్నారు.

విధుల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులు

పెనగలూరు, జనవరి 11: తమ సమస్యల పరిష్కారం కొరకు సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు గురువారం విధుల్లో చేరారు. యూనియన్ నాయకుల ఆదేశాల ప్రకారం సమ్మెను తాత్కాలికంగా విరమించినట్లు తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలని రైల్వే డీఎంకు వినతి



డీఎంకు వినతిపత్రం అందిస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

ఓబులవారిపల్లె, జనవరి 11: రాజంపేట, రైల్వేకోడూరుకు సంబంధించిన రైల్వే సమస్యలను పరిష్కరించాలని గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ మనీష్ అగర్వాల్‌కు ఆ డివిజన్ బోర్డు మెంబర్ భరత్‌కుమార్‌రెడ్డి కోరారు. రైల్వేస్టాపేజెస్ పైన రేణిగుంట-నంద్యాల వరకు పొడిగించే రైలుకు అన్ని స్టేషన్లలో స్టాపింగ్ కల్పించాలని డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌లో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్, నందలూరులో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, మరికొన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లు నిలపాలని కోరారు. అలాగే రైల్వేకోడూరు అండర్ బ్రిడ్జి డబుల్ రోడ్డు, ఓబులవారిపల్లె అండర్ బ్రిడ్జి, రాజంపేట రైల్వేస్టేషన్ దగ్గర ఉన్న అండర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని వినతిపత్రం ఇచ్చారు.

మద్యపాన నిషేధాన్ని అమలు చేయండి



మద్యం దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

రాయచోటిటౌన్, జనవరి 11: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారని, వెంటనే మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర డిమాండ్ చేశారు. గురువారం రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రోడ్డులో గల మద్యం దుకాణం వద్ద ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆమె మాట్లాడుతూ మద్యం కంపెనీలను ప్రభుత్వమే సృష్టించి ఆరోగ్యాలు నాశనం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా మద్య నిషేధం చేయకపోతే ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం లీడర్లు అరుణమ్మ, సాధికున్, నసీబ్‌జాన్, సనా తదితరులు పాల్గొన్నారు.

భారీ ఎత్తున ముగ్గుపిండి ప్యాకెట్లు పంపిణీ



ముగ్గుపిండి ప్యాకెట్లను సిద్ధం చేస్తున్న గంటా చారిటబుల్ ట్రస్ట్ సిబ్బంది

రాజంపేట, జనవరి 11: సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటింటా రంగవల్లులు మెరిసిపోయేలా వేసుకోవడానికి టీడీపీ నేత గంటా నరహరి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ముగ్గు పిండిని సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగా రాజంపేట నియోజకవర్గంలోని రాజంపేట, నందలూరు, సుండుపల్లె, వీరబల్లి, సిద్దవటం ఒంటిమిట్ట ప్రాంతాల్లో ప్రత్యేక వాహనాల ద్వారా మండల కేంద్రాల్లోనూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర గ్రామాల్లోనూ ముగ్గులు వేసుకోవడానికి వీటిని ప్యాకెట్ల ద్వారా అందించనున్నారు. ఈ మేరకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి గంటా చారిటబుల్ ట్రస్ట్ ప్యాకెట్లను సిద్ధం చేశారు.

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రాన్స్‌పోర్టు లారీ

వృద్ధుడి మృతి, డ్రైవర్‌కి తీవ్రగాయాలు

బంగారుపాళ్యం, జనవరి 11: ట్రాక్టర్‌ని ఓ ట్రాన్స్‌పోర్టు లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందగా, డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహాసముద్రానికి చెందిన చిన్నయ్య, కరిపిరెడ్డిపల్లెకు చెందిన రామయ్య (65)లు ట్రాక్టర్‌లో కేజీసత్రానికి బయల్దేరారు. బుధవారం అర్ధరాత్రి చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిలోని సంక్రాంతి పల్లె సమీపంలో ఉన్న కిరిపిరెడ్డిపల్లె వద్దకొచ్చేసరికి చిత్తూరు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న వీఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీ వెనుకవైపు నుంచి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చిన్నయ్య, రామయ్య తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామయ్య చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం అయ్యాక బంధువులకు అప్పగించి, ఏఎస్‌ఐ మల్లప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్నతోడు కింద రూ.15.96 కోట్ల లబ్ధి



లబ్ధిదారులకు చెక్ అందిస్తున్న ఎంపీ, కలెక్టర్ తదితరులు

చిత్తూరు, జనవరి 11: చిరువ్యాపారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు కార్యక్రమాన్ని అమలు చేసిందని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. గురువారం తాడేపల్లి నుంచి సీఎం జగన్ వర్చువల్ విధానంలో 8వ విడత జగనన్న తోడు పథకాన్ని ప్రారంభించగా, స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షన్మోహన్, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, ఇతర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 15,085 మందికి రూ.15.96కోట్లు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. అర్బన్ పరిధిలో 4,447 మందికి రూ.4.60 కోట్లు, గ్రామీణ ప్రాంతంలోని 10,738 మందికి రూ.11.36 కోట్లు వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు. జడ్పీ మహిళాస్థాయీ చైర్‌పర్సన్ భారతి, డీఆర్డీఏ పీడీ తులసి, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, జిల్లా యువజన సంక్షేమ అధికారి ప్రదీప్ కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'వైసీపీది అప్రజాస్వామిక పాలన'

చిత్తూరు సిటీ, జనవరి 11: వైసీపీది అప్రజాస్వామిక పాలన అని ఎన్‌ఆర్‌ఐ యష్ విమర్శించారు. చిత్తూరులోని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు కాజూరు రాజేష్ నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ నిత్య అబద్ధాలు, మోసాలతోనే పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ, ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం జగన్ తప్పులను ఎత్తి చూపినందుకు తనను అక్రమంగా అరెస్టు చేశారన్నారు.



సీఆర్ రాజన్‌కు సన్మానం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తిరుచానూరు మాజీ సర్పంచ్ సీఆర్ రాజన్ జన్మదినం సందర్భంగా గురువారం ఆయన్ను గజమాలతో సత్కరిస్తున్న కిషోర్‌రెడ్డి, హరిరామ్‌రెడ్డి, సాయి రాయల్, తిరుచానూరు టీడీపీ నేతలు

19న చంద్రబాబు సభ కోసం స్థలాల పరిశీలన



రామానాయుడుపల్లె వద్ద స్థలాన్ని పరిశీలించిన టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, జనవరి 11: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఈనెల 19న రా.. కదలిరా బహిరంగ సభ నిర్వహించనున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ భీమనేని చిట్టిబాబునాయుడు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, యాదవసాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్‌లతోపాటు పలువురు నాయకులు గురువారం స్థల పరిశీలన చేశారు. గంగాధర నెల్లూరు మండలంలోని రామానాయుడుపల్లె, నెల్లేపల్లె గ్రామాల వద్ద, అదేవిధంగా శ్రీరంగ రాజపురం మండలంలోని క్షీరసముద్రం వద్ద చిత్తూరు - పుత్తూరు ప్రధానరోడ్డుకు పక్కన ప్రైవేటు భూముల్లో బహిరంగ సభ, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ఏర్పాటు కోసం స్థలాలను పరిశీలించారు. ఈ వివరాలను జిల్లా, రాష్ట్ర టీడీపీ నేతల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు గుండయ్య, నెల్లేపల్లె మాజీ సర్పంచ్ పుష్పరాజ్, మండల ప్రధానకార్యదర్శి జ్యోతిరెడ్డి, నేతలు రాజశేఖర్ నాయుడు, మునిరాజులయాదవ్, దేవరాజులు నాయుడు, సిద్ధయ్యశెట్టి, విజయకుమార్‌రెడ్డి, దేవరాజులు, వెంకటేష్‌యాదవ్, చిదంబరం, దాము, బుజ్జిబాబు, చిన్ని పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి రూ.11.11 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న దాత

ఐరాల (కాణిపాకం), జనవరి 11: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి రూ.5,00,000, గో సంరక్షణ ట్రస్టుకు 5,11,111, ఆలయంలో నిర్వహించే ఉదయాస్తమయ సేవకు రూ.1,00,000 హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన మురళీకృష్ణ విరాళమిచ్చారు. ఈ మొత్తానికి చెందిన చెక్‌ను అధికారులకు అందించారు. దాతకు ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'రా... కదలిరా' సభను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 11: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఈనెల 19న టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించే 'రా... కదలిరా' సభను చేయాలని ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ.. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు, రాష్ట్ర అభివృద్ధికి టీడీపీ అధికారంలోకి రావాలన్న అవసరాన్ని తెలియజేయడమే ఈ సభ ఉద్దేశమన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర కుమార్, అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు కార్లా అరుణ, నేతలు శశికర్ బాబు, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు నుంచి వెంటాడి..!

● కందూరు వద్ద పట్టుబడిన 'ఎర్ర' కారు

సోమల, జనవరి 11: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కారును పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వెంటాడారు. సోమల మండలం కందూరు వద్ద పట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లె ప్రాంతం నుంచి చెన్నైకి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు నిఘా వేశారు. గురువారం ఉదయం 5 గంటలకు పీలేరు పొంతల చెరువు క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ కారు ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది. అటవీశాఖ అధికారులు ఆ కారును వెంబడించడంతో రేగళ్ల మీదుగా సోమల వైపు మళ్లింది. అయినా అధికారులు వెంటాడంతో కందూరు వద్ద దుండగలు కారును వదలి పారిపోయారు. కారును, రూ.8 లక్షల విలువ చేసే ఐదు ఎర్రచందన దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

పాలవ్యాన్ ఢీకొని ఇద్దరి దుర్మరణం

● మరొకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన నారాయణప్ప, రాజేష్ - తీవ్రంగా గాయపడిన లోకనాథ ఆచారి

గంగవరం, జనవరి 11: గంగవరం మండలం మారెడుపల్లె సమీపంలోని పలమనేరు- దండపల్లె రహదారిలో గురువారం ద్విచక్రవాహనాన్ని పాలవ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన ప్రకారం.. పలమనేరు పట్టణానికి చెందిన నారాయణప్ప, రాజేష్, లోకనాథ ఆచారి వెల్డింగ్ పనులు చేసుకొంటూ జీవనం సాగించేవారు. దండపల్లె సమీపంలో ఓ ఇంటికి గేటు అమర్చడం కోసం ఈ ముగ్గురూ ద్విచక్రవాహనంలో గురువారం బయలుదేరారు. దండపల్లె రోడ్డులో వెళ్తుండగా, ఎదురుగా అతివేగంగా వస్తున్న పాలవ్యాన్ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో నారాయణప్ప(54) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మిగిలిన ఇద్దరిని స్థానికులు ఆటోలో పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజేష్(44) మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన లోకనాథ ఆచారిని చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు : డీఎంహెచ్‌వో

చిత్తూరు రూరల్, జనవరి 11: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో తాత్కాలిక ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఎంపీహెచ్‌ఏ సర్వీసుల క్రమబద్ధీకరణకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తెలిపారు. కొంత మంది దళారులు తాము పర్మినెంట్ చేయిస్తామని డబ్బులు అడిగితే ఇచ్చి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు.

కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె


మదనపల్లెలో మోకాళ్లపై నిలబడి అంగన్వాడీల నిరసన



వాల్మీకిపురంలో గడ్డితో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మదనపల్లె టౌన్, జనవరి 11: సమ్మె విరమించకపోతే అంగన్వాడీలను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఐసీడీఎస్ అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చినా ఏమాత్రం బెదరకుండా గురువారం 31వ రోజు సమ్మె అంగన్వాడీలు సమ్మె చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి, డిమాండ్లను తీర్చాల్సిన ప్రభుత్వం బెదిరింపు ధోరణిలో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా న్యాయవాదుల సంఘం నాయకుడు సోమశేఖర్, సీఐటీయూ నాయకుడు హరీంద్రనాథ్ శర్మ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు అనసూయ, భాగ్యమ్మ, రాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు తేల్చి చెప్పారు. తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరుకోగా రిలే నిరాహారదీక్ష ఆరవ రోజుకు చేరుకుంది. అంగన్వాడీలు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో సమ్మె శిబిరం వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో మండలంలోని కోటకొండ, రెడ్డికోటలలో అంగన్వాడీ కేంద్రాలను ఆయా అంగన్వాడీ వర్కర్లు తెరవడానికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న యూనియన్ ప్రతినిధులు, అంగన్వాడీలు పెద్దఎత్తున కేంద్రాల వద్దకు చేరుకుని మూసివేయించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు కరుణశ్రీ, గౌరి, ఉమాదేవి, సులోచన, సరస్వతి, స్వరూపారాణి, శివమ్మ అంగన్వాడీలు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 31వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు యూనియన్ లీడర్ శ్రీవాణి మాట్లాడుతూ సమ్మె కీలక దశకు చేరుకున్న సమయంలో మనల్ని చీల్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, అంగన్వాడీ కార్యకర్తలందరూ మన హక్కుల సాధన కోసం ఏకతాటిపై నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మూడు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: కనీస వేతనాలు అడుగుతుంటే ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యమా అంటూ అంగన్వాడీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు గడ్డిని తింటూ వినూత్న రీతిలో నిరసనలు తెలియజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత 31రోజులుగా కనీస వేతనాలు, గ్రాట్యుటీ, తదితర డిమాండ్లు సాధన కోసం సమ్మె చేపడితే సీఎం జగన్మోహన్‌రెడ్డికి చెవికెక్కడం లేదని నినదించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తల విషయంలో సరైన నిర్ణయం తీసుకోకపోతే సరైన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, ప్రసన్న, అమ్మాజీ, లక్ష్మీనరసమ్మ, దేవసేన, రెడ్డిరాణి, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలు లేకుండానే ప్రజావేదిక నిర్వహణ..!

- రూ.36,500లు రికవరీ
- రికార్డులు ఇవ్వనందుకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నోటీసులు
- పీలేరులో తూతూమంత్రంగా సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ సభలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు, జనవరి 11: పీలేరు సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో గురువారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి ఒక్కరంటే ఒక్కరు సాధారణ ప్రజలు, గ్రామీణులు హాజరు కాలేదు. సభలో ఏర్పాటు చేసిన కుర్చీల్లో పీలేరు మండలంలో పనిచేస్తున్న ఉపాధి సిబ్బందే సరిపోయారు. వారి సమక్షంలోనే అధికారులు రికార్డులు, తనిఖీ సిబ్బంది నివేదికల పరిశీలన పూర్తి చేసి సామాజిక తనిఖీ ప్రక్రియను మమ అనిపించారు. ఇక ఎక్కడా లోపాలు ఎత్తిచూపకపోతే ఉన్నతాధికారులకు, ప్రజలకు అనుమానం వస్తుందనుకున్నారో ఏమో, రూ.8.13 కోట్ల పనుల్లో రూ.36,500ల రికవరీకి ఆదేశించారు. పీలేరు మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 2022 ఏప్రిల్1 నుంచి 2023 మార్చి 31 మధ్యలో రూ.8,13,36,954లతో 3425 పనులు చేపట్టారు. వాటిలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.6,25,95,114లతో జగనన్న ఇళ్లతోపాటు నీటి సంరక్షణ పనులు, ఉద్యాన పంటలు వంటి 3407 పనులు చేపట్టారు. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.1,86,59,624లతో 17 పనులు, సమగ్ర శిక్ష పథకంలో రూ.82,216లతో ఒక పని చేశారు. వాటిని పరిశీలించడానికి సామాజిక తనిఖీ జవాబుదారీతనం, పారదర్శకత సంస్థ(ఏపీఎస్ఎస్ఏఏటీ)లోని ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు గత ఏడాది డిసెంబరు 24 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో ఆయా పనులను తనిఖీ చేశారు. వారి తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలు, లోపాలను ప్రజల ముందు పెట్టి సమీక్షించేందుకు బుధవారం పీలేరు సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు డ్వామా పీడీ మద్దిలేటి, ఉపాధి హామీ పథకం అంబుడ్స్‌మెన్ శివప్రసాద్, విజిలెన్స్ ఆఫీసర్ ప్రకాశ్, పీలేరు ఎంపీడీవో డా.మురళీమోహన్ రెడ్డి, ఏపీడీ నందకుమార్ రెడ్డి హాజరయ్యారు. రూ.8.13 కోట్ల పనులకు జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభలో అధికారులు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు రూ.36,500ల రికవరీకి ఆదేశించారు. అదీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు చేసిన అకౌంటింగ్ తప్పిదాలకు. ఆ తరువాత మండలంలోని దొడ్డిపల్లె, ముడుపులవేముల సచివాలయాల భవనాలకు సంబంధించిన రికార్డులు సకాలంలో అందించనందుకు ఆయా పంచాయతీల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నోటీసులు జారీ చేశారు. అంతకు మించి అధికారులకు ఎటువంటి తప్పిదాలు కనిపించలేదు. సామాజిక తనిఖీ సభకు గ్రామాల నుంచి ఎవరూ రాకుండా ఉండేందుకు అటు అధికార పార్టీ నేతలు, ఇటు ఉపాధి హామీ సిబ్బంది అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. జగనన్న కాలనీ ఇళ్లకు చెల్లిస్తున్న బిల్లులు మినహా మిగితా పనులన్నీ అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలే చేసుకున్నారని, గ్రామస్థాయిలో సమావేశాలు జరిగినప్పుడే అక్రమాలు బయటకు పొక్కకుండా ఎక్కడిక్కడ కట్టడి చేసేశారని, ఇక సామాజిక తనిఖీ సభకు వెళ్లి అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండదని చాలా మంది గ్రామస్థులు సభకు రావడానికి అనాసక్తి చూపినట్లు తెలిసింది. అంతే కాకుండా క్షేత్రస్థాయిలో పనులు తనిఖీ చేసేటప్పుడు చూసీచూడనట్లు పోవాలని తనిఖీల కోసం వచ్చిన సిబ్బందికి కూడా స్థానిక అధికారులు చేతులు తడిపినట్లు సమాచారం. దీంతో ప్రజల సమక్షంలో జరగాల్సిన ప్రజావేదిక అంతర్గత సమీక్ష సమావేశంగా ముగిసిందని పలువురు వ్యాఖ్యానించారు.

సంస్కృతీ, సంప్రదాయాలను కొనసాగిద్దాం


జడ్పీ హైస్కూల్లో సంక్రాంతి సంబరాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో మురళి

మదనపల్లె టౌన్, జనవరి 11: సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాల వరకు కొనసాగిద్దామని ఆర్డీవో మురళి పేర్కొన్నారు. గురువారం స్థానిక జడ్పీహైస్కూల్లో ముందస్తు సంక్రాంతి పండుగ ఉత్సవాల ఏర్పాట్లను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటేనే చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొంటారని, పశువుల పండుగను ఘనంగా నిర్వహిస్తారన్నారు. ఇంటర్నెట్ యుగంలో కనుమరుగైపోతున్న ఈ సాంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయడానికి మదనపల్లెలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి జడ్పీ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. పుర ప్రముఖులు, అన్నిశాఖలు స్వచ్ఛందంగా ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నారని, ఈ సంబరాలకు పుర ప్రజలందరు హాజరు కావాలని కోరారు.

వడ్డెర ఓబన్న ఆదర్శనీయుడు

మదనపల్లె టౌన్, జనవరి 11: స్వాతంత్ర్య సంగ్రామంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యాన్ని ముందుండి నడిపిన వడ్డెర ఓబన్న అందరికి ఆదర్శనీయుడని వడ్డెర సంఘం నాయకులు ఎలుగెత్తి చాటారు. గురువారం వడ్డెర ఓబన్న 217 జయంతి సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు స్థానిక చౌడేశ్వరి సర్కిల్ నుంచి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరు బస్టాండులో వారు మాట్లాడుతూ వడ్డర ఓబన్న జయంతికి రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని, ఓబన్న చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలన్నారు. మదనపల్లెలో ఓబన్న విగ్రహం ప్రతిష్టించాలన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తరహాలో ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు జరిపిటి రెడ్డెప్ప, మేకల రెడ్డిశేఖర్, రేపన ముని, బండి ఆనంద్, మేస్త్రీ శ్రీనివాసులు, పద్మనాభరాజు, రమణ, గుణభూషణ్,వడ్డెర్లు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: వడ్డెర వీరుడు, తొలి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న 217వ జయంతి వేడుకలను జిల్లా వడ్డెర నాయకుడు దేరంగుల నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వడ్డెర సంఘ నాయకుల అధ్వర్యంలో బారీ కేక్ కట్ చేసి వడ్డెర నాయకులకు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వడ్డెర సాధికార సమితి అధ్యక్షుడు పద్మనాభం, తంబళ్లపల్లె సాధికార సమితి అధ్యక్షుడు నాగమల్లప్ప, శంకరనారాయణ, రాజంపేట పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి నాగరాజు, రమణప్ప, శ్రీరాములు, వెంకటరమణ, మునెప్ప, శీనా, శంకర, ఆది, ఓబులేసు పాల్గొన్నారు.

బీజేపీ నేతను పరామర్శించిన సాయిలోకేష్

కలకడ, జనవరి 11: మండల బీజేపీ అధ్యక్షుడు ఆంజనేయులునాయుడును గురువారం ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ పరామర్శించారు. ఆంజనేయులు తండ్రి చంద్రయ్యనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న సాయిలోకేష్ గంగాపురంలోని వారి ఇంటికి వెళ్లి సంతాపం తెలిపి ధైర్యం చెప్పారు. పీలేరు అసెంబ్లీ కన్వీనర్ శ్రీకాంత్, నాయకులు ఉన్నారు.

చంద్రబాబు-పవన్ కలయికతో వైసీపీకి దడ


కరపత్రాలు పంచుతూ టీడీపీ నాయకుల ప్రచారం

వాల్మీకిపురం, జనవరి 11: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ల కలయికతో వైసీపీకి దడ పట్టుకుందని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముస్తూరువాండ్లపల్లెలో పార్టీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జి కోసూరి చంద్రమౌళి, యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీనాథరెడ్డి, బూత్ కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంపీటీసీ మదనమోహన్‌రెడ్డి, నాయకులు రెడ్డిమోహన్‌రెడ్డి, నారదరెడ్డి, నిత్యానందరెడ్డి, నాగరాజు, మమత, రెడ్డెప్పరెడ్డి, యర్రక్క, రాజమ్మ, అలివేలు, అంజలి తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ రాకుండా జాగ్రత్తలు చేపట్టండి

మదనపల్లె టౌన్, జనవరి 11: డెంగ్యూ జ్వరాలు వ్యాపించకుండా విస్తృతంగా పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. గురు వారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రక్త పరీక్షల ల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో సెంట్రినల్ సర్వేలెన్స్ ఆస్పత్రి కేవలం మదనపల్లెలోనే ఉందని, ఇక్కడే రక్తంలో ఎలాసా పద్ధతిలో పరీక్షలు నిర్వహిం చాలన్నారు. ప్రజల్లో ఎవరికైనా ఐదు రోజుల జ్వరం వచ్చిందంటే అటువంటి వారికి డెంగ్యూ రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. గత ఏడాది జిల్లాలో 151 డెంగ్యూ కేసులు నమోదు కాగా అందులో మదనపల్లె డివిజన్‌లోనే 85 పాజిటివ్ కేసులు నమోదయ్యాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి, మలేరియా యూనిట్ అధికారి ఖలీల్, ల్యాబ్ టెక్నీషియన్ ఉమాపతి పాల్గొన్నారు.

ఏపీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిని కలిసిన రెడ్డిసాహెబ్


మాణిక్యంఠాగూర్‌తో మదనపల్లె నేత రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్, జనవరి 11: రాష్ట్రకాంగ్రెస్ పార్టీ ఏపీ ఇన్‌ఛార్జిగా నియమితులై మొదటసారీ ఏపీకి విచ్చేసిన మాణిక్యంఠాగూర్‌ను శుక్రవారం మదనపల్లె నియోజకవర్గ నాయకుడు షేక్‌రెడ్డిసాహెబ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువ కప్పి, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు.

ఆటోలో నుంచి జారి పడి మహిళ మృతి

పెద్దతిప్పసముద్రం జనవరి 11 : ఓ షేర్ ఆటోలో నుంచి జారి పడి శిరోమణి (50)అనే మహిళ మృతి చెందిన సంఘటన పీటీఎంలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు రాపూరివాండ్లపల్లె పంచాయతీ ఉప్పరవాండ్లపల్లెకు చెందిన కొందరు మహిళా కూలీలు రోజువారి కూలి పనుల నిమిత్తం రంగసముద్రం పంచాయతీ కుర్రావాండ్లపల్లె వద్దకు షేర్ ఆటోలో వెళ్లే వారు ఇదే క్రమంలో గురువారం యథావిధిగా కూలీ పనుల కోసం వారు ఆటోలో వెళ్లి కూలీ పనులు ముగించుకుని ఆటోలో ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో కుర్రావాండ్లపల్లె సమీపంలోని కాసేవాండ్లపల్లె సమీపంలో అందులో ప్రయాణిస్తున్న ఉప్పరవారిపల్లెకు చెందిన రాజేంద్ర భార్య శిరోమణి (50) ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి కింద పడిపోయింది. దీంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందింది. అనంతరం ఆటోలో ఉన్న వారు అదే ఆటోలోనే ఆమె మృతదేహాన్ని ఆమె స్వగ్రామమైన ఉప్పరవారిపల్లెకు తరలించారు. పోలీసులకు ఎటువంటి పిర్యాదు చేయలేదని కుటుంబీకులు తెలిపారు. మృతి చెందిన శిరోమణికి ఒకుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదవ శాత్తు జరిగిన ఈ సంఘటనతో ఉప్పరవారిపల్లెలో విషాదం చోటుచేసుకుంది.

వాహనం సహా ఎర్ర దుంగలు స్వాధీనం

పీలేరు, జనవరి 11: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనంతో సహా 5 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. సుండుపల్లె అటవీ ప్రాంతం నుంచి చెన్నైకు ఎర్రచందరం అక్రమ రవాణా జరగుతోందన్న సమాచారం మేరకు బుధవారం రాత్రి 11 గంటల నుంచి పీలేరు మండలం పొంతలచెరువు క్రాసు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 5 గంటల సమయంలో సుండుపల్లె వైపు నుంచి వచ్చిన డీఎల్7 సీహెచ్ 6037 కారును తాము తనిఖీ చేయగా అందులో 149 కేజీలు బరువున్న 5 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. కారులోని వ్యక్తులు దానిని వదిలి పారిపోయారన్నారు. దీంతో కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది ప్రభుతేజ, చరణ్, మల్లిఖార్జున, సుబ్రహ్మణ్యం పాల్గొన్నట్లు వివరించారు.

కోడిపందేలు, పేకాటపై కేసులు నమోదు

వాల్మీకిపురం, జనవరి 11: సంక్రాంతి పండుగ సందర్భంగా వాల్మీకిపురం సర్కిల్ పరిధిలో ఎక్కడైనా కూడా కోడి పందేలు, పేకాట జూదం నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ సురేష్‌బాబు హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ వేడుకలను కుటుంబాల నడుమ ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. జంతువులను బలిపశువులుగా చేసే ఆటలు కోడి పందేలు, జల్లికట్లు తదితరం పూర్తిగా నిషేధమని తెలియ జేశారు. అలా కాదని పేకాట, కోడి పందేలు, జూదాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సర్కిల్ పరిధిలోని కలికిరి, వాల్మీకిపురం మండలాలలో ముమ్మర నిఘా పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వరరావ్, సిబ్బంది పాల్గొన్నారు.

10లీటర్ల సారా స్వాధీనం..వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లి, డిసెంబరు 11: గుట్టుచప్పుడు కాకుండా నాటుసారాను విక్రయిస్తున్న శ్రీరామాచారి(45)అనేవ్యక్తిని అరెస్టు చేసి వద్ద నుంచి 10లీటర్ల స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రాచివేటివారిపల్లె గ్రామం దిగువమాచిరెడ్డిగారిపల్లెలో చింతచెట్టు కింద నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

డ్రంకైన్ డ్రైవ్ కేసులో జరిమానా

నిమ్మనపల్లి, జనవరి 11: డ్రంకైన్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ ఓ వ్యక్తికి గురువారం మదనపల్లె సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్ రూ.17వేలు జరినామా లేదా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ముష్టూరు పంచాయతి దిగువపల్లెకు చెందిన రావల్ మంజూసింగ్(39) 5రోజుల కిందట మద్యం తాగి తన ద్విచక్రవాహనంలో వస్తుండగా పోలీసులు పట్టుకొన్నట్లు తెలిపారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా జడ్జి నిందితుడికి రూ.17వేలు అపరాధం చెల్లించని పక్షంలో 3నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారని తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

ములకలచెరువు, జనవరి 11: మండలంలోని కోనేటివారిపల్లె పంచాయతీ ఏడుమడకలపల్లెలో జూదం ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి రూ.7140లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా జూదాలు జరిగితే సమాచారం ఇవ్వాలన్నారు.

అగ్నిప్రమాదంలో కారు దగ్ధం

మదనపల్లె టౌన్, జనవరి 11: మదనపల్లె పట్టణం శేషప్ప తోటలో గురువారం ఉదయం పార్కింగ్ చేసిన కారులో మంటలు రేగడంతో కారు దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఫైర్ ఆఫీసర్ శివప్ప ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని కారులో మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.20వేలు ఆస్తినష్టం జరిగిందని కారు యజమాని తెలిపారు.

కేంద్ర నిధులతో గ్రామాల అభివృద్ధి

పెద్దమండ్యం, జనవరి 11: కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల అభివృద్ధి ముందుకు సాగుతున్నట్లు కేంద్ర వికసిత్ భారత్ యాత్ర ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మనోహర్ గౌడ్ పేర్కొన్నారు. పెద్దమండ్యం, కలిచెర్ల గ్రామాలలో కేంద్ర వికసిత్ భారత్ యాత్ర సాగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 పథకాలను సంచార వాహనం వీడియో ద్వారా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాషా, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎంఈవో మనోహర్, డీటీ గౌరిశంకర్, ఏవో సురేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూ ఏఈ హరిప్రసాద్, ఏపీవో మురళి, ఈవోఆర్డీ జనార్థన, ఆయూస్ డాక్టర్ మహబూబ్‌బాషా, సీహెచ్‌వో క్రిష్ణయ్య పాల్గొన్నారు.

అంధుల పరికరాల కోసం ఆర్థిక సాయం

మదనపల్లె టౌన్, జనవరి 11: అంధులకు ఉపయోపడే ఎలక్ట్రానిక్ స్టిక్స్ పరికరాల కోసం కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక అంధుల, వికలాంగుల సంఘం అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో బ్రెయిలీ జయంతి సందర్భంగా తిరుపతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో అంధులకు ఎలక్ట్రానిక్ చేతి స్టిక్‌లు కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించాలని సర్పంచ్ చలపతిని అంధుల సంఘం అధ్యక్షుడు రాజు కోరారు. దీంతో చలపతి తమ స్నేహితుల సహకారంతో రూ.20వేలు ఆర్థిక సహాయం చేశారు.

బెస్తలను ఆదుకోని ప్రభుత్వాలు

పెద్దతిప్పసముద్రం జనవరి 11 : బెస్తలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని జిల్లా బెస్త సాధికార కమిటీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ (ముంబై దుర్గా) అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర ఆదేశానుసారం తంబళ్లపల్లె నియోజకవర్గ మాజీ శాసన సభ్యుడు శంకర్‌యాదవ్ ఆదేశానుసారం గురువారం మండల కేంద్రమైన పీటీఎంలో బెస్త కులస్థుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. రాయలసీమ ప్రాంతంలో బెస్తలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బాగా వెనుక బడి ఉన్నారన్నారు. బెస్త సాధికార సమితి సభ్యుడు బీజి. సుబ్రమణ్యం, బెస్త కులస్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ/కలకడ, జనవరి 11:తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన రా.. కదలిరా..! సభను విజయవంతం చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గుర్రంకొండలో గురువారం ఆయన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, అరాచకాలను ప్రజలకు వివరించడానికి టీడీపీ చేపట్టిన రా.. కదలిరా! కార్యక్రమం ఈనెల 24న పీలేరులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ సీఎం చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లు హాజరై టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టనున్న పథకాలను తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి గుర్రంకొండ మండలం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామాల వారీగా నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, నౌషాద్‌అహ్మద్, హరిప్రసాద్‌నాయుడు, ఏజాజ్‌అహ్మద్, మేకల చలపతి, చలమారెడ్డి, మురళీ, రాము, ప్రదీప్, క్రాంతి, ప్రకాశ్, సుంకర శేఖర్, నాగేంద్రరెడ్డి, సుధాకర్, జయసూరి, బయ్యారెడ్డి, చంద్రబాబు, మహాత్మారెడ్డి, ఆనంద్, జయప్రకాశ్, వెంకటరమణ, ప్రసాద్, చిన్నప్ప, సుబ్బరాజు, సుబ్బయ్య పాల్గొన్నారు. అలాగే కలకడ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సమావేశమై మాట్లాడారు. గతంలో మదనపల్లెలో జరిగిన మహానాడు, నారాలోకేశ్ యువగళం పాదయాత్రకు ఇక్కడ నుంచి అధిక సంఖ్యలో పార్టీశ్రేణులు పాల్గొన్ని విజయవంతం చేశారని ఇదే స్ఫూర్తితో రా..కదలిరా! కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాశ్‌నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్, నాయకులు పొత్తూరి ప్రభాకర్‌నాయుడు, బరకం శ్రీనివాసులరెడ్డి, మద్దిపట్ల వెంకటరమణనాయుడు, తిరుపతినాయుడు, కోట రమణనాయుడు, కాంతారావు, పివినాయుడు, త్యాగరాజు, రైస్‌మిల్ రమణ, ఈశ్వరయ్య, కోటి, తారక, బాలాజి, రమణనాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారంటీ


బాబు ష్యూరిటి భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి

మదనపల్లె టౌన్, జనవరి 11: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ వస్తుందని మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 16, 17 మున్సిపల్ వార్డులో బాబు ష్యూరి టి..భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొమ్మలపాటి మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో మినీ మ్యానిఫెస్టోతో ప్రజల్లో విస్తృతంగా చర్చ వస్తోందన్నారు. జగన్ పాలన భేరీజు వేసుకున్న ప్రజలు, అరాచక పాలనను అంతమొందిచేందుకు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు చలపతినాయుడు, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు భవానిప్రసాద్, దేవరింటి శ్రీనివాసులు, సోమశేఖర్, రఘునాథ్‌నాయుడు, హరిప్రసాద్, మైథలి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం

ములకలచెరువు, జనవరి 11: రాష్ట్రంలో వైసీపీ పాలనలో బీసీకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ పేర్కొన్నారు. ఆ మేరకు గురువారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ సంజీవ్ లాగానే మరికొద్ది రోజుల్లోనే చాలా మంది బీసీలు వైసీపీని వీడతారన్నారు. వైసీపీలో బీసీలకు రాజకీయ భవిష్యత్తు లేదన్నారు. పార్టీ కేవలం ఒకే సామాజిక వర్గం ఆధీనంలో ఉందన్నారు. బీసీ యువతకు సరైన విద్యా ప్రోత్సహకాలు అందడం లేదన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలన్నీ చిన్నాభిన్నం అయ్యాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి కంటే అప్పుల వైపు అడుగులు వేస్తోందన్నారు. రాష్టం అభివృద్ధి చెందాలన్నా, సుభిక్షంగా ఉండాలన్నా వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి పార్టీ అధినేత చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అరాచక వైసీపీ పాలనకు రోజులు దగ్గర పడ్డాయి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, జనవరి 11: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా పేర్కొన్నారు. టీడీపీ అధిష్టానం సూచనల మేరకు గురువారం ములకలచెరువులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసీపీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ విధ్వంస, అరాచక, అవినీతి పాలనకు చమరగీతం పాడడం ఖామన్నారు. రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, టీడీపీ నేతలు కేవీ రమణ, చెన్నకిష్టా, నాయకులు భజంత్రి రామాంజులు, సుధాకర్‌నాయుడు, జహీర్, బసివి చంద్ర, రమణమూర్తి, నాగేంద్ర, నారాయణస్వామి, శీన, సుబ్బినాయుడు, ప్రతాప్, మోహన తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో రాజ్యాధికారం సాధించుకుందాం!

- బలిజలకు కాపు సంక్షేమ సేన నేత ఆమంచి శ్రీనివాసులు పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ఆమంచి శ్రీనివాసులు

పీలేరు, జనవరి 11: ఐకమత్యంతో ఉంటూ రాజ్యాధికారం సాధించుకుందామని రాష్ట్రంలోని బలిజలకు కాపు సంక్షేమ సేన గౌరవ సలహాదారు ఆమంచి శ్రీనివాసులు అలియాస్ ఆమంచి స్వాములు పిలుపునిచ్చారు. పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీ మొరవవడ్డిపల్లెలో గురువారం పీలేరు మండల బలిజల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో కేవలం 15 శాతం లేని వారు రాజ్యాధికారం చేపట్టి పాలిస్తున్నారని, జనాభాలో 25 శాతం కంటే ఎక్కువగా ఉన్న కాపులు, బలిజలు రాజ్యాధికారానికి దూరంగా ఉండిపోతున్నారన్నారు. బలిజలు రాజ్యాధికార సాధన కోసం ఉద్యమించాలని ఆ ఉద్యమాన్ని ముందుండి నడిపేందుకు హరిరామజోగయ్య వంటి అనుభవజ్ఞులు తమకు అండగా ఉన్నారన్నారు. రాజకీయాల్లో ఒక దీక్షతో పవన్ కళ్యాణ్ ముందుకు సాగుతున్నారని, రాష్ట్రంలోని బలిజలు ఆయనకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్, జనసేన పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేశ్, మదనపల్లె ఆర్‌ఆర్ జ్యువెలర్స్ అధినేత రామాంజులు, అన్నమయ్య జిల్లా కాపు సంక్షేమ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్ బాబు, అధ్యక్షురాలు రెడ్డిరాణి, నాయకులు దారం అనిత, సుబ్బయ్య పాల్గొన్నారు.

అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులా..!


మదనపల్లె కోర్టు వాయిదాకు హాజరైన టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 11: వైసీపీ పాలనలో చోటుచేసుకున్న అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడం ఏంటని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి, పోతబోలు మాజీ సర్పంచ్ పఠాన్‌ఖాదర్‌ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. 2021 సంవత్సరం గుంటూరులో రమ్యపై యాసిడ్ దాడి చేసి హత్య చేసిన నిందితులను అరెస్టు చేయాలని మదనపల్లెలో టీడీపీ నాయకులు స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేశారు. అప్పట్లో పోలీసులు టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేశారని ఈ క్రమంలో గురువారం స్థానిక కోర్టులో హాజరు కావాలని వారికి సమన్లు రావడంతో టీడీపీ నాయకులు కోర్టు వాయిదాకు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఖాదర్‌ఖాన్ మాట్లాడుతూ కరోనా సమయంలో అన్నార్తులకు అన్నదానం చేసినందుకు తనపై కేసులు పెట్టారన్నారు. అంతే కాకుండా అంగళ్లులో చంద్రబాబు పర్యటనలో పాల్గొన్న తనపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి నెల రోజుల పాటు జైలులో పెట్టారన్నారు. ఇలా 16 కేసులు పెట్టి వేధించారన్నారు. తనతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారన్నారు. కోర్టు వాయిదాకు హాజరైన వారిలో నాదెళ్ల అరుణ్ తేజ, ముద్దుకృష్ణమనాయుడు, విజయమ్మ, మహబూ బ్‌ఖాన్, అయూబ్, వొంటికొండ వెంకటేశ్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం నియామకం

మదనపల్లె టౌన్, జనవరి 11: మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ నూతన చైర్మన్‌గా తట్టి శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్‌గా ఎంఆర్ వెంకటేశ్‌బాబు, సభ్యులుగా లక్ష్మీదేవి, అపర్ణ, సుమ, రమణప్ప, బయన్న, జయమ్మ, శంకర్‌నాయక్, మేకల అరుణ, రెడ్డెమ్మ, రెడ్డిపల్లె ఆశా, షేక్ ప్యారేజాన్, మాధవరెడ్డి, గంగులరెడ్డితో పాటు పీఏసీఎస్ అధ్యక్షుడు, మార్కెటింగ్ ఆఫీసర్, వ్యవసాయశాఖ ఏడీ, మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్‌లను సభ్యులుగా నియమించారు.